# 610 జీవోను వెంటనే అమలు చేయాలి

**తె**లంగాణ పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపుతున్న వివక్షకు 610 జివో ఒక సాక్ష్యం. 1985లో జారీఅయిన ఈ ప్రభుత్వ ఉత్తర్వు మార్చి 31, 1986 నాటికే అమలుకావాలి. కానీ ఈనాటికీ అమలుకు నోచుకోలేదు. 610 జీవో అమలుకు తగు సూచనలిమ్మని ప్రభుత్వం నియమించిన కమిటీల నివేదికలు కూడా పాతబడుతున్నాయి. కానీ ఆ జీవో మాత్రం అమలుకావడం లేదు.

తెలంగాణ ప్రాంతంలో ఆరు సూత్రాల పథకం అమలులో జరిగిన అవకతవకలను సరిచేయడానికి, అక్రమాలను రూపుమాపటానికి ఈ జీవో వచ్చింది. కనుక జీవో విశిష్టత తెలుసుకోవాలంటే ముందుగా ఆరుసూత్రాల పథకం గురించి తెలుసుకోవాలి.

1973లో జారీఅయిన ఆరుసూత్రాల పథకాన్ని తెలంగాణవాసులు కోరలేదు. ఇది జై ఆంధ్ర ఉద్యమ ఫలితంగా కోస్తా ఆంధ్ర ప్రయోజనాలను కాపాడటానికి పుట్టుకొచ్చింది. 1956లో పెద్దమను షుల ఒప్పందం ఉద్యోగ రంగంలో తెలంగాణకు ఇచ్చిన రక్షణలన్నింటినీ ఆరుసూత్రాల పథకం నీరుగార్చింది.

1973 వరకు కొనసాగిన పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం తెలంగాణలో కనీసం 15 సంవత్సరాల స్థిరనివాసమున్న వారికే ఈ ప్రాంతంలో ఉద్యోగం పొందే అర్హత ఉండేది. దీన్నే ముల్కీ నిబంధన అనేవారు. ముల్కీ నిబంధనల వల్ల తెలంగాణ ప్రాంత ఉద్యోగాలను తెలంగాణ వాసులే పొందే అవకాశం కలిగింది. మిగతా ప్రాంత ఉద్యోగాలను, రాష్ట్ర స్థాయి ఉద్యోగాలను ఓపెన్ కాంపిటీషన్‌లో ఎంపికైన వారితో భర్తీచేసేవారు. రాష్ట్ర పాలనా యంత్రాంగంలో తెలంగాణ వాసులకు తగు భాగస్వామ్యం కల్పించడానికే ముల్కీ నిబంధనలు ఉనికిలోకి వచ్చాయి. ఆరు సూత్రాల పథకం తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాలను తెలంగాణవాసులకే రిజర్వు చేసిన ముల్కీ నిబంధనలను రద్దుచేసింది. వాటి స్థానంలో దిగువ పద్ధతిని ప్రతిపాదించింది.

నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలైన తహసిలేరు, జూనియర్ ఇంజనీరు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్థాయిలేక అంతకన్నా దిగువస్థాయి ఉద్యోగాలకు స్థానికులనే ఎంపిక చేయాలి. ఈ నియమం ప్రకారం పైన పేర్కొన్న ఉద్యోగాలకు స్థానికులే అర్హులు. ఉద్యోగం ఏ ప్రాంతంలో ఉంటే ఆ ప్రాంతం వారినే నియమించాలి. అంటే తెలంగాణవాసులకేకాదు ఆంధ్ర రాయలసీమ వాసులకు కూడా తమ ప్రాంత ఉద్యోగాలలో రిజర్వేషన్ లభించింది. నిజానికి తెలంగాణ వాసులెవ్వరూ తమ ప్రాంతాన్ని వదిలి ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలను కాజేయలేదు. కాబట్టి అక్కడ లోకల్ కాండిడేట్లకు లోకల్ ఉద్యోగాలలో రిజర్వేషన్లు అనవసరం. ఎక్కడైనా బలహీనులకు విద్యా, ఉద్యోగ రంగాలలో ప్రాతినిధ్యం కల్పించడానికే రిజర్వేషన్లు అమలు చేస్తారు. ఆరు సూత్రాల పథకం ఈ నియమానికి విరుద్ధమైనది.

ఆరు సూత్రాల పథకానికి చట్టబద్ధత కల్పించడానికి నాటి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని సవరించింది. ఈ సవరణ వలన రాష్ట్రాన్ని వివిధ జోన్లుగా వర్గీకరించే అధికారం, ఆయా జోన్లలోని ఉద్యోగాలలో స్థానికులకు రిజర్వేషన్ కల్పించే అధికారం రాష్ట్రపతికి సంక్రమించింది. కొత్తగా వచ్చిన అధికారంతో రాష్ట్రపతి జారీచేసిన ఆర్డరు రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించింది. హైదరాబాద్ ఆరవ జోనులో భాగమైంది. ఒక వ్యక్తి ఏదేనీ జోనులో లోకల్ క్యాండిడేటుగా గుర్తింపు పొందడానికి కనీసంగా ఆ జోనులో నాలుగు సంవత్సరాలు స్థిరనివాసముంటే చాలు. ఈ నియమం వలన నాలుగు సంవత్సరాలు తెలంగాణలో నివాసముంటే చాలు తెలంగాణ వాసులైపోవచ్చు. ఆవిధంగా ప్రాంతేతరులు తెలంగాణలో ఉద్యోగం పొందడానికి అవకాశం కలిగింది.

ఇదిగాక రాష్ట్రపతి ఆర్డరు కొన్ని ఉద్యోగాలను లోకల్ కేడర్స్‌గా గుర్తించింది. వీటికి లోకల్ అభ్యర్థులే అర్హులు. లోకల్ కేడర్స్‌లోని ఉద్యోగ స్థాయిని బట్టి లోకల్ అభ్యర్థులకు 60-80 శాతం ఉద్యోగాలు రిజర్వు చేయబడినాయి. క్లర్కు ఉద్యోగాలలో 80 శాతం రిజర్వేషన్ ఉండగా ఉద్యోగ స్థాయి పెరిగినకొద్దీ రిజర్వేషన్ పాలు తగ్గుతుంది. లోకల్ కేడర్స్‌లో స్థానిక అభ్యర్థులకు రిజర్వేషన్ పోగా మిగిలిన ఉద్యోగాలకు ఓపెన్ కాంపిటీషన్‌లో రాష్ట్రంలోని ఏ ప్రాంతం వారినైనా ఎన్నుకోవచ్చు. రాష్ట్రపతి ఉత్తర్వులో మరొక ముఖ్యమైన అంశమేమిటంటే లోకల్ కేడర్స్‌కు చెందని ఉద్యోగాలలో (సచివాలయం, డైరెక్టరేట్లు, కార్పొరేషన్లు, భారీ అభివృద్ధి ప్రాజెక్టులు తదితర రాష్ట్ర స్థాయి ఆఫీసులకు చెందిన ఉద్యోగాలలో) రాష్ట్రపతి ఆర్డరు ప్రకారం అన్ని ప్రాంతాల వారికి న్యాయ సమ్మతమైన వాటా కల్పించాలి.

రాష్ట్రపతి ఉత్తర్వులను తెలంగాణలో మాత్రమే అమలు చేయలేదు. సచివాలయం స్థాయి విభాగాలలో తెలంగాణవాసులకు న్యాయ సమ్మతమైన వాటా లభించలేదు. ఇక లోకల్ కేడర్స్ విషయంలో కూడా తెలంగాణలో ఆరుసూత్రాల పథకాన్ని పాటించనేలేదు. బదిలీల ద్వారా, డిప్యుటేషన్ ద్వారా, బోగస్ సర్టిఫికెట్ల ద్వారా, స్థానికేతరులను అక్రమంగా తెలంగాణకు తీసుకొచ్చారు. ఇదికాక స్థానికేతరులు రావడానికి మరొక తప్పుడు పద్ధతిని అవలంబించారు. అదేమిటంటే ఓపెన్ కాంపిటీషన్ పోస్టులను స్థానికేతరులతో నింపారు. ఓపెన్ కాంపిటీషన్ పోస్టులకు లోకల్, నాన్‌లోకల్ అభ్యర్థులిద్దరినీ సమానంగా పరిగణించి ఆ ఇద్దరిలో మెరిట్ కలవారినే నియమించాలి. కానీ అందుకు భిన్నంగా ఓపెన్ కాంపిటీషన్ పోస్టులను నాన్‌లోకల్ అభ్యర్థులకు రిజర్వేషన్‌గా పరిగణించి వారినే నియమిస్తూ వచ్చారు.

ఈ విధంగా తెలంగాణలో స్థానికేతరులు వివిధ ఉద్యోగాలలో ప్రవేశించారు. ముల్కీ నిబంధనల వలన వచ్చిన హక్కులను హరించి వేసిన ఆరు సూత్రాల పథకం కూడా సరిగ్గా అమలుకాలేదు. ఈ అక్రమాలను రూపుమాపటానికే 610 జీవో వచ్చింది.

ఈ గవర్నమెంట్ ఆర్డర్ ఆరు సూత్రాల నిబంధనలకు విరుద్ధంగా నియమించబడిన నాన్‌లోకల్ ఉద్యోగస్తులను వారి స్వస్థలాలకు పంపించాలని సూచించింది. అంతేకాక వివిధ జోన్ల మధ్య విచ్చలవిడిగా బదిలీ చేయరాదని, తెలంగాణ వారికి రాష్ట్రస్థాయి ఉద్యోగాలలో సముచితంగా అవకాశాలు కల్పించాలని, బోగస్ సర్టిఫికెట్లను పెట్టిన వారిపై చర్య తీసుకోవా లని, ఆరు సూత్రాల పథకం వచ్చిన తర్వాత జరిగిన నియామకాలన్నింటిని పరిశీలించాలని, అక్రమ బదిలీలు, నియామకాలు ప్రమోషన్లపై తెలంగాణ అభ్యర్థులు పెట్టుకొన్న అప్పీళ్ళను త్వరితంగా పరిష్కరించాలని ఈ

జీవో పేర్కొన్నది. ఈ చర్యలన్నీ 31 మార్చి 1986లోగా పూర్తిగా అమలుకావలసి ఉండె. కానీ ఇప్పటికీ జీవో అమలుకు నోచుకోలేదు. 1985లో జీవో జారీ అయిన నాటికే తెలంగాణలో 59 వేల మంది స్థానికేతరులు అక్రమంగా నియమించబడినారు. జీవో అమలుకాక పోవడం వలన తెలంగాణలో స్థానికేతరుల నియామకాలు అడ్డూ అదుపు లేకుండా కొన సాగాయి. ఇప్పుడు దాదాపు ఆ సంఖ్య లక్షన్నర దాటింది.

తెలంగాణవాదం బలపడిన తరువాతనే 610 జీవో మళ్ళీ వెలుగులోకి వచ్చింది. జీవోను అమలు చేయాలన్న డిమాండ్ బలపడింది. ఒత్తిడికి తలవంచి ప్రభుత్వం జీవో అమలుకు సూచనలివ్వమని, ఆరుసూత్రాల పథకం అమలును సమీక్షించమని కోరుతూ మాజీ ఐఎఎస్ అధికారి గిర్‌గ్లానిని ఏకసభ్య కమిషనుగా నియమించింది. కమిషన్ మూడు నెలల్లోనే తొలి నివేదికను సమర్పించింది. కమిషన్ తన నివేదికలో ఆరుసూత్రాల పథకం ఉల్లంఘన జరిగిన తీరును వివరించింది. తెలంగాణలో ఆరు సూత్రాల పథకాన్ని పటిష్టంగా అమలు చేయడానికి తగు సూచనలు చేసింది. నివేదికపై అసెంబ్లీలో వాడిగా వేడిగా చర్చ జరిగింది. ఫలితంగా ఆరు సూత్రాల పథకం అమలును సమగ్రంగా పరిశీలించడానికి సభా సంఘం నియమించ బడింది. సభా సంఘం కూడా మధ్యంతర నివేదికను సమర్పించింది. ఇంత జరిగినా ప్రభుత్వం 610 జీవోను గానీ, సభా సంఘం నివేదికను గానీ, గిర్‌గ్లాని కమిటీ నివేదికనుగాని అమలు చేయలేదు. వాటి అమలుకు సభలో ఇచ్చిన వాగ్దానాలను కూడా నిలబెట్టుకోలేదు. ఏ ప్రాంతం వారికి ఆ ప్రాంతం ఉద్యోగాలన్నీ దక్కాలన్న ఆరుసూత్రాల పథకం, దాన్ననుసరించి వచ్చిన రాష్ట్రపతి ఆర్డరు రాష్ట్రమంతటా అమలవుతున్నాయి ఒక్క తెలంగాణలో తప్ప. తెలంగాణ పట్ల రాష్ట్రంలో కొనసాగుతున్న వివక్ష వల్లనే ఆరు సూత్రాల పథకం కూడా అమలుకు నోచు కోవడం లేదు. కనుక 610 జివోను గాని, గిర్‌గ్లానీ కమిషన్ నివేదికను గాని, సభా సంఘం నివేదికను గాని అమలు చేయాలని కోరడమంటే తెలంగాణ పట్ల కొనసాగుతున్న వివక్షను వ్యతిరేకించడమే. వివక్షను చూపడమంటే మనుషులందరినీ ప్రభుత్వాలు సమానంగా చూడా లన్న సమానత్వపు హక్కు తెలంగాణవాసుల విషయంలో ఉల్లంఘించుతున్నట్టే లెక్క. అందుకే మానవహక్కుల వేదిక సమానత్వపు హక్కును గౌరవించి, 610 జివో తదితర నివేదికలను అమలు చేయాలని డిమాండు చేస్తున్నది.

మెదక్ 24.8.2003